## క్లుప్తంగా

### 13న బండలాగుడు పోటీలు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న శివునిపల్లె గ్రామానికి ఎదురుగా వెలసిన శ్రీ కాశిరెడ్డినాయన స్వామి 23వ ఆరాధన ఉత్సవాలలో బాగంగా ఈనెల 13వ తేదీ వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుపనున్నట్టు కమిటీ వారు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ ఎడ్లతో బండలాగుడు పోటీల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ వారు కోరారు.

### మండల సర్వేయర్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు

వీరబల్లి : మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న సులోచనపై గడికోట గ్రామ పంచాయతీ రైతులు తహసీల్దార్ వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె సక్రమంగా పనిచేయడం లేదని, కొలతలు కూడా సక్రమంగా నిర్వహించడం లేదని, రైతులను చాలా ఇబ్బందులు పెడుతున్నారని గడికోట గ్రామ రైతులు తహసీల్దార్‌కు తెలియజేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ సర్వేయర్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో గడికోట రైతులు తదితరులు పాల్గొన్నారు.

### కారుణ్య నియామక పత్రం అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఎం.వెంకటరమణ సతీమణికి కారుణ్య నియామకంలో భాగంగా జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు హోంగార్డు నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఈ నియామక పత్రాన్ని అందించారు. హోంగార్డు వృత్తిలో కొనసాగుతూ అనారోగ్యంతో ఎం.వెంకటరమణ మృతి చెందాడు. అంకితభావంతో విధులు నిర్వర్తించి మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, హోంగార్డు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.పెద్దయ్య, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ పి.రాజా రమేష్, హోంగార్డు ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ వై.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి రైతుకు విశిష్ట నెంబర్ తప్పనిసరి

రాజంపేట రూరల్ : వ్యవసాయం చేసే ప్రతి రైతు 14 అంకెల విశిష్ట నెంబరును తప్పనిసరిగా కలిగి ఉండాలని వ్యవసాయ అధికారిణి గుజ్జల రాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వ్యవసాయ రంగంను ఆధునీకరణ చేయడానికి ఆధార్ కార్డు తరహాలో రైతులకు కేంద్ర ప్రభుత్వం 14 అంకెల విశిష్ట నెంబరు అందించనుంది. అందువలన ప్రతి రైతు తమ సచివాలయం వద్దకు మీ ఆధార్ కార్డు, పాసుబుక్ లేదా 1బీ, ఫోన్ నెంబర్‌ను తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రాయితీలు, పథకాలు రైతులకు అందాలంటే ఈ 14 అంకెల నెంబరు తప్పనిసరి అని తెలియజేశారు.

### ఏయూలో రక్తదాన శిబిరం

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీలో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాజంపేట ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డా.పీవీఎస్ రాజు, మెడికల్ ఆఫీసర్ సుభశ్రీ ఆధ్వర్యంలో జరిపారు. ఈ శిబిరానికి రిమ్స్ కడప సహాయ సిబ్బంది తదితరులు సహకారాలు అందించారు. డా.పీవీఎస్ రాజు మాట్లాడుతూ ఏడాదిలో ఒకసారి అయినా రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి మంచిదన్నారు. శిబిరంలో 102 మంది విద్యార్థులు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణ, అన్నమాచార్య యూనవర్సిటీ రిజిస్ట్రార్ డా.మల్లికార్జునరావు, ఏఐటీఎస్ రాజంపేట ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.ఎల్,ఓబులపతి, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలో పప్పు దినుసుల దినోత్సవం



పప్పు దినుసులతో విద్యార్థులు తయారు చేసిన చిత్రాలు

పుల్లంపేట : దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో పప్పు దినుసుల దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పప్పు దినుసులతో విద్యార్థులు భారతదేశ పటం, జాతీయ జెండా, పుష్పాలు, సూర్యుడు, రోబో, యాపిల్ వంటి ఆకారలను తయారు చేసి అందరినీ అబ్బురపరిచారు. పప్పు దినుసులు ఆరోగ్యానికి దోహదపడతాయని ఉపాధ్యాయుడు రమణ పేర్కొన్నారు.

### వీరభద్రునికి పల్లకి సేవ



పల్లకి సేవలో ఉత్సవమూర్తులు

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో సోమవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో కర్ణాటక నుంచి విచ్చేసిన భక్తులు, స్థానిక భక్తుల మేళతాళాలతో ఘనంగా పల్లకి సేవ నిర్వహించారు.

# నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ పరమౌషధం

- విద్యార్థులతో మాత్రను మింగించిన వైద్యులు, సిబ్బంది
- ఆరోగ్యానికి దోహదం చేస్తుందన్న అధికారులు



ఒంటిమిట్ట: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్యాధికారి నాగరాజు



సుండుపల్లె: ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న డాక్టర్ శేఖర్ రెడ్డి



సిద్దవటం: మాధవరం-1 అంగన్వాడీ సెంటర్‌లో..

ఒంటిమిట్ట : విద్యార్థులలో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్ర పరమౌషధమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు అన్నారు. సోమవారం ఒంటిమిట్టలోని శ్రీ సాయి భారతి ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు వయస్సు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను కచ్చితంగా ఇవ్వాలని తెలిపారు. మాత్ర గొంతులో ఇరుక్కోకుండా ఉండేందుకు దానిని బాగా చప్పరించి తాగునీటితో కలిపి మింగాలని సూచించారు. ఫిబ్రవరి 10న ఈ మాత్రలను వేసుకోని వారు ఫిబ్రవరి 17వ తేదీన జరిగే కార్యక్రమంలో కచ్చితంగా వేసుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామ తులసీ, డాక్టర్ రమేష్, ఒంటిమిట్ట వైద్యురాలు శ్వేత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బరామయ్య, స్థానిక వైద్య సిబ్బంది నవీన్ కుమార్, రామ్మూర్తి నాయక్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగలను నులిపేద్దామని సంబేపల్లె జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జెడ్పీ ఉన్న పాఠశాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. రక్తహీనత, పోషకాహార లోపం, ఆలకలి మందగించడం, కడుపు నొప్పి, బలహీనత, వికారం, వీరేచనాలు, వాంతులు తదితర వ్యాధుల నివారణకు ఈ మాత్రలు ఉపయోగపడతాయన్నారు. మొత్తం పాఠశాలలోని 464 మంది విద్యార్థులకు ఈ మత్రాలను అందజేసినట్టు పేర్కొన్నారు. అదే విధంగా మండలంలోని అన్ని పాఠశాలలోని విద్యార్థులకు ఈ మాత్రలను పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

సిద్దవటం : పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని అంగన్వాడీ కార్యకర్త సుబ్బలక్షుమ్మ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా సిద్దవటం మండలం లోని మాధవరం-1 గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ సుజాత, పిల్లలు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం పీహెచ్‌సీ పరిధిలోని బెస్తపల్లి ఉర్దూ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు వారి ఆరోగ్యంపై డాక్టర్ శేఖర్ రెడ్డి సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల వలన రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయని తెలియజేశారు. ప్రతిఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలను మింగాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, సూపర్ వైజర్ ఎల్లమ్మ, ఏఎన్ఎం లక్ష్మీదేవి, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : 1 - 19 సంవత్సరాల వయస్సు కల్గిన బాలబాలికలు నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా తినాలని కోనంపేట ప్రాథమిక వైద్యాధికారి బొదనపు సిద్దయ్య పేర్కొన్నారు. సోమవారం ఏపీ మోడల్ స్కూల్‌లో 470 మంది విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను వేశారు. అలాగే మండల వ్యాప్తంగా ఐదువేల మంది విద్యార్థులకు నులిపురుగల మాత్రలు వేసినట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శివశంకర్ రెడ్డి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : పాత చిట్వేలి ఎంపీపీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు మింగించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్బంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను తినిపించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని, రక్తహీనత బారిన పడకుండా ఉండాలంటే నులిపురుగుల నివారణ ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శివనారాయణ రెడ్డి, ఆశ వర్కర్ కన్యాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేట : పుల్లంపేటలో డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్బంగా మండల కేంద్రంలోని ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు ఆల్బెండల్ జోల్‌ను విద్యార్థులకు అందజేశారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాలలోపు పిల్లలకు అర్థ మాత్ర, 3 నుంచి 19 సంవత్సరాలు వయస్సు కల్గిన వారికి ఒక మాత్ర అందించారు. మండల వ్యాప్తంగా 7229 మందికి నులిపురుగులు మాత్రలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ, హెచ్ఎం వరదారెడ్డి, సూపర్‌వైజర్లు మహేష్, సుబ్బారెడ్డి, శరత్ చంద్రరాజు, ఏఎన్ఎం లక్ష్మీదేవి, రాములమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### పీజీఆర్ఎస్ వినతులను సత్వరమే పరిష్కరించాలి



ప్రజా సమస్యలను వింటున్న సబ్ కలెక్టర్ వైకోమ్

రాజంపేట : పీజీఆర్ఎస్ వినతులను సత్వరమే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ వైకోమ్ నైదియా దేవి అన్నారు. సోమవారం అన్నమయ్య సభా భవనంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. వాటిని నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో వినతులను అక్కడే తహసీల్దారు పరిష్కారం చేయాలన్నారు. పరిష్కారం కాని స్థితిలో డివిజన్ స్థాయిలోకి రావాల్సి ఉంటుందన్నారు. డివిజన్ స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న వారికి శాఖపరంగా వచ్చే వినతులను పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు.

**సమస్యల పరిష్కారానికే 'ప్రజా వేదిక'**

గాలివీడు : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓలు, సిబ్బందితో కలసి ఆమె గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, ప్రజలను నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండల పరిధిలో ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలియజేశారు. ఈ సందర్బంగా తహసీల్దార్ భాగ్యలత మాట్లాడుతూ మండల పరిధిలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటిని వృథా చేయవద్దు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సిద్దవటం : ప్రజలు నీటిని వృథా చేయకుండా వినియోగించాలని నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎస్.రాజంపేట గ్రామంలో సోమవారం ప్రజలకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వాటర్ షెడ్ల వల్ల కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నీరు నిలిచి భూగర్భ జలాలు మెరుగుపడతాయన్నారు. చెట్ల పెంపకం వల్ల కాలుష్య నివారణతోపాటు స్వచ్ఛమైన గాలి, వాతావరణంలో మార్పుల వల్ల వర్షాలు కురుస్తాయని భూగర్భ జలాలతో రైతులు వ్యవసాయం లాభ సాటిగా మారుతుందన్నారు. అడవులను నరికివేత మొదలగు కారణాలతో పర్యావరణంలో సమతుల్యం లోపించి వాతావరణ మార్పుల వలన సకాలంలో వర్షాలు పడటంలేదని, వర్షాధార ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయం ఒక సమస్యగా మారిందన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ జనార్దన్‌రెడ్డి, టెక్నికల్ అధికారి రామచంద్ర, ఏఎస్ఐ బాబయ్య, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్‌రెడ్డి, పోలీసులు, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాయచోటి అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి అర్బన్ : రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయడంలో శ్రీకాంత్‌రెడ్డి కృషి అమోఘమని రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయ భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్ఆర్‌సిపి జిల్లా కార్యాలయంలో ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. కరువు తాండవిస్తున్న రాయచోటిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వాన్ని ఒప్పించడంలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారన్నారు. ఇందుకు ప్రజా ఉద్యమాలు ఎంతో సహకరించాయన్నారు. అందుకు తగ్గట్టుగానే శ్రీకాంత్‌రెడ్డి జిల్లా కేంద్రంలో అవసరమయ్యే భవనాలను నెలకొల్పడంలో క్రియాశీలకంగా పని చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా కేంద్రాన్ని తరలిస్తారని వస్తున్న వార్తలను ఆయన తప్పుబట్టారు. రాయచోటి నుంచి జిల్లా కేంద్రం తరలిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కూటమి నాయకులు జిల్లా కేంద్రంలో కొనసాగించాల్సిన అభివృద్ధి పనులను కొనసాగించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వం చేపట్టిన పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యామ్‌కుమార్, నేతలు సంజీవ, నవాజ్ క్రిష్‌లు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు 12 వరకు గడువు

గాలివీడు : బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకునేవారికి ఈనెల 12 వరకు గడువు ఉన్నట్టు ఎంపీడీఓ జవహర్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 2024 - 25 సంవత్సరానికి గాను గాలివీడు మండలానికి స్టేట్ బ్యాంకు ద్వారా 26 యూనిట్లు కేటాయించగా అందులో బీసీ-8, ఈడబ్ల్యూఎస్-1, కాపు-4, మైనారిటీ-13 వున్నాయి, యూనియన్ బ్యాంకు 35 యూనిట్లు కేటాయించగా అందులో బీసీ-16, ఈడబ్ల్యూఎస్-2, కాపు-4, మైనారిటీ-13 వున్నాయి. అలాగే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు గాలివీడు శాఖకు 25 యూనిట్లు కేటాయించగా అందులో బీసీ-9, ఈడబ్ల్యూఎస్-1, కాపు-2,మైనారిటీ-13 వున్నాయి. గ్రామీణ బ్యాంకు నూలివీడు శాఖకు 23 యూనిట్లను కేటాయించగా అందులో బీసీ-8, ఈడబ్ల్యూఎస్-1,కాపు-2, మైనారిటీ-12 కేటాయించినట్టు తెలియజేశారు. అర్హులైన నిరుద్యోగులు 21 - 60 ఏళ్లలోపు వారు ఓబీఎంఎంఎస్ ద్వారా 50 శాతం సబ్సిడీతో కూడిన రుణాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రేషన్, ఆధార్, కుల ధృవీకరణ పత్రాలతో మీసేవ, ఇంటర్నెట్ సెంటర్లలో దరఖాస్తులు చేసుకుని సదరు కాపీలను ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలని సూచించారు.

## విలీనసభను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : ఈనెల 14న జరుగనున్న పీడీఎస్‌యూ విలీనసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న కోరారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విలీనసభ పోస్టర్లను ఆ సంఘం నేతలతో కలసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ 2013లో రెండుగా చీలిన పీడీఎస్‌యూ కార్యవర్గాలు సంయుక్తంగా ఈ నెల 14వ తేదీన నెల్లూరు నగరంలో విలీనసభను నిర్వహించ తలపెట్టినట్లు వివరించారు. పీడీఎస్‌యూలోని రెండు వర్గాల ఐక్యత దేశంలో ఉన్న మరిన్ని విప్లవ విద్యార్థి సంఘాల ఐక్యతకు తోడ్పాటును అందిస్తుందన్నారు. విలీనసభకు విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ అన్నమయ్యజిల్లా నేతలు అమీర్, సాయి నాయక్, రమణ, ఖాదర్‌బాషా, చిన్నారెడ్డి, భాస్కర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పట్టాతో ఏవీ.సుబ్బరాజు, పి.గోపినాథ్

రాజంపేట టౌన్ : పట్టణంలోని సరస్వతీపురానికి చెందిన ఏవీ సుబ్బరాజు, పసుపులేటి గోపినాథ్‌లకు అమెరికాకు చెందిన గ్లోబల్ పీస్ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. విశాఖపట్నంలోని పబ్లిక్ లైబ్రరీలో ఈనెల 9వ తేదీ జరిగిన కార్యక్రమంలో యూనివర్శిటీకి చెందిన డాక్టరేట్స్ ఎంపిక ఛైర్మన్ డాక్టర్ వీవీ మురళీమోహన్ చేతులమీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు ఏవీ.సుబ్బరాజు, గోపినాథ్‌లు సోమవారం విలేకరులకు తెలిపారు. దాదాపు నలభై ఐదేళ్లుగా కళాకారులుగా రాణిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడంలో భాగంగా వందకుపైగా లఘుచిత్రాలకు రచన, దర్శకత్వం చేయడంతోపాటు ఆ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించినందుకు గ్లోబల్‌పీస్ యూనివర్శిటీ తమ ప్రతిభను గుర్తించి తమకు డాక్టరేట్ ప్రదానం చేయడం ఎంతో ఆనందంగావుందన్నారు.

### అబాకస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

రాజంపేట రూరల్ : అబాకస్ పోటీలలో జాతీయ స్థాయిలో తమ విద్యార్థి తోకల భవేశ్ ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభ చూపడం గర్వకారణమని రాజు హైస్కూల్ సీఈఓ గుంటిమడుగు రఘురామరాజు, ప్రిన్సిపల్ వందాడి మోహన్‌రెడ్డిలు తెలియజేశారు. స్థానిక రాజు హైస్కూల్‌లో సోమవారం విద్యార్థి భవేశ్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. అకడమిక్ ఇన్‌చార్జ్ హబీబ్‌తో కలిసి రఘురామరాజు, మోహన్‌రెడ్డిలు భవేశ్‌కు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేసి ప్రశంసించారు. విద్యార్థులు అబాకస్‌పై శిక్షణ పొందితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఈ అభినందన సభలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

సిద్దవటం : అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ మండల రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో గత నెలలో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులపై సమీక్ష జరిపారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించిన ఒక వీఆర్ఓ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశించారు. వివిధ అవసరాల నిమిత్తం రెవెన్యూ కార్యాలయానికి వచ్చే పేద ప్రజలను కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించకుండా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలియజేశారు. పనితీరును మెరుగుపరుచుకోవాలని అధికారులు, సిబ్బందికి ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ శంకర్‌రావు, ఇన్‌చార్జ్ తహసీల్దారు మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓలు, మండలంలోని సర్వేయర్‌లు తదితరులు పాల్గొన్నారు.

### వేడుకగా పుష్కర కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ఉర్లగడ్డపోడు పంచాయతీ కాపుపల్లిలో జరిగిన కోదండ రామాలయ పుష్కర, రెండవ మహాకుంభాభిషేకాన్ని నిర్వాహకులు వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తదితరులు ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీ రమణ, ఓబుల్ రెడ్డి, గజ్జల శ్రీనివాసులు రెడ్డి, మురళీ మోహన్ రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి



రామాపురం: బండపల్లిలో సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం : సిమెంటు రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బండపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నియోజకవర్గంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**యూసుఫ్‌బాషాను అభినందించిన మంత్రి**

రాయచోటి జగదాంబసెంటర్ : తంబళ్లపల్లి పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్ యూసుఫ్‌బాషా నేపాల్‌లో ఈ నెల 1, 2, 3వ తేదీలలో ఇండియా పాకిస్తాన్‌పై జరిగిన షూటింగ్ బాల్‌లో ఇండియా తరపున ఆడి గెలుపొందారు. దీంతో సోమవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారి షూటింగ్ బాల్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మహమ్మద్ యూసుఫ్‌బాషాను అభినందించారు.

చిన్నమండెం : మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో మంత్రి మండిపల్లి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ అర్జీలను మంత్రికి సమర్పించారు.

## కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

రాయచోటి అర్బన్ : గతంలో పాలకులు రద్దుచేసిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి బత్తల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16, 17 తేదీలలో నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభల కరపత్రాలను సోమవారం ఆయన కార్మికులతో కలసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గత పాలకులు రద్దుచేసిన సంక్షేమ బోర్డును కూటమి నేతలు తర్వాత పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పట్టణ ప్రాంతాల్లోని భవన నిర్మాణ కార్మికులకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి 3 సెంట్లు చొప్పున భూమిని ఇంటిపట్టాలుగా మంజూరుచేసి ఆదుకోవాలంటూ కోరారు. నిర్మాణ కార్మికుల అడ్డాలలో మహిళలకు మరుగుదొడ్లు నిర్మింపచేయడంతోపాటు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలంటూ డిమాండ్ చేశారు. ఈనెల 16, 17 తేదీలలో రైల్వేకోడూరులో నిర్వహించే ఏఐటీయూసీ జిల్లా మహాసభలకు కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలంటూ ఆయన కోరారు. కార్యక్రమంలో రహంతుల్లా, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, నాగసుబ్బయ్య, ఫక్రుద్దీన్, వెంకటేష్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

### హెల్మెట్, లైసెన్స్ తప్పనిసరి

సిద్దవటం : ద్విచక్ర వాహనాలు నడిపేవారికి హెల్మెట్, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. సిద్దవటం గ్రామ సమీపంలోని మూలపల్లె క్రాస్‌రోడ్డులో సోమవారం సాయంత్రం ఎస్ఐ వాహనాలను తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని వాహనదారులను హెచ్చరించారు.

## క్లుప్తంగా

**ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట**

రామాపురం : కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె సమీపంలో వెలసిన మరకత శివలింగం ఆలయంలో సోమవారం ధ్వజ స్తంభం, శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

**వైభవంగా విగ్రహ ప్రతిష్ట**

సిద్దవటం : ఆకులోపల్లి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం సీతా రామ లక్ష్మణ హనుమంతుని విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.

**మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు**

రాయచోటి టౌన్ : మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి సోమవారం హెచ్చరించారు. సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలో భాగంగా మద్యం మత్తులో(డ్రంక్ అండ్ డ్రైవ్) వాహనాలు నడుపుతూ పట్టుబడిన జాఫర్, తులసి ప్రసాద్, ఇలియాస్, షావలీ, వెంకటప్రసాద్, రామాంజులు, రమణయ్య, మౌలాలి, రమణ, శ్రీనివాసులు, బాలాజీ, పుల్లారెడ్డి, మొహిద్దీన్, శశికుమార్, కృష్ణారెడ్డి, సబ్జాన్‌లను జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ.10,500లు విధించినట్లు తెలియజేశారు.

**వాసవీమాత సన్నిధిలో మోహన్‌రెడ్డి**

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణంలోని గాంధీబజార్‌లో ఉన్న అమ్మవారిశాలలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ సురేష్, వేదపండితులు మోహన్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు వారికి దుశ్శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

**పార్కింగ్‌కు స్థలం కేటాయించాలి**

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ద్విచక్ర వాహనదారులు, ఆటోలకు పార్కింగ్ ఏర్పాటు చేసి పోలీసులు, గ్రామ పంచాయతీ అధికారులు సహకరించాలని సోమవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పండుగోలు మణి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభించారు.

**ప్రణాళికాబద్ధంగా సన్నద్ధంకావాలి**

సుండుపల్లె : ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సన్నద్ధమై మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ-2 రవీంద్ర నాయక్ తెలిపారు. సోమవారం జీకే రాచపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదివిన వాటిని అర్థం చేసుకోవాలన్నారు. పరీక్ష రాసేటప్పుడు ఒత్తిడిని లోను కాకూడదన్నారు. ఈ సందర్భంగా పరీక్షల్లో అనుసరించాల్సిన పద్ధతులపై పలు సూచనలు చేశారు.

**ఉత్సవాలను జయప్రదం చేయండి**

ఒంటిమిట్ట : శ్రీ మాతంగ మహర్షి, శ్రీ సంత్ రవిదాస్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సోమవారం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ కోరారు. ఒంటిమిట్టలో ఆది జాంబవ ధర్మ రక్షా సమితి, ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న జయంతి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

**ప్రకృతి వ్యవసాయం చేయాలి**

పెనగలూరు : ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని తహసీల్దార్ అమరేశ్వరి అన్నారు. పెనగలూరులో చాపల లక్ష్మీదేవి, కొండూరు ఇన్‌చార్జ్ శైలజలు ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్‌ను తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మొదటగా కూరగాయలను కొనుగోలు చేసి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు.

**గర్భిణులకు వైద్య పరీక్షలు**

వీరబల్లి : గర్భిణులకు డాక్టర్ షఫీవుల్లా ఆధ్వర్యంలో సోమవారంవైద్య పరీక్షలను చేశారు. వారికి ఆరోగ్య విషయాలపైన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే మందులను, మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులకు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, ఆయన కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డిలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**సమస్యలను పరిష్కరించండి**

రాయచోటి అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాసులు, వి.సురేష్‌కుమార్‌లు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌ను కలిసి సమస్యలను తెలియజేశారు. మున్సిపాలిటీల్లో జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలంటూ డిమాండ్ చేశారు.